# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 26 జూన్ : 2024 విడుదల : 10

**యెహోవా ధర్మశాస్త్రమునందు**

**ఆనందించుచు దివారాత్రము దానిని**

**ధ్యానించువాడు ధన్యుడు.**

**-కీర్తన 1:2**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

జూన్ - 2024

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/-

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-4 |
| 2. | ఒక గడియయైనను | 5-6 |
| 3. | దేవుని వాక్యంలో ఆనందం | 7-11 |
| 4. | ప్రేమ మౌనంగా ఉంటుంది | 12 |
| 5. | మార్టిన్ కల | 13-14 |
| 6. | ఉన్నతమైన ఆశలు | 15-19 |


**సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

***మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికీ నా హృదయపూర్వకమైన వందనములు తెలియజేయుచున్నాను.***

**"రాజైన దావీదు బహు వృద్ధుడు కాగా సేవకులు అతనికి ఎన్ని బట్టలు కప్పినను అతనికి వెట్ట కలుగక యుండెను. కాబట్టి వారు మా యేలినవాడవును రాజవునగు నీ కొరకు తగిన చిన్నదాని వెదకుట మంచిది; ఆమె రాజైన నీ సముఖమందుండి నిన్ను ఆదరించి వెట్ట కలుగుటకు నీ కౌగిటిలో పండుకొనునని చెప్పి, ఇశ్రాయేలీయుల దేశపు దిక్కులన్నిటిలో తిరిగి ఒక చక్కని చిన్నదాని వెదకి, అబీషగు అను షూనేమీయురాలిని చూచి రాజునొద్దకు తీసుకొని వచ్చిరి. ఈ చిన్నది బహు చక్కనిదై యుండి రాజును ఆదరించి ఉపచారము చేయుచుండెను గాని రాజు దానిని కూడలేదు." 1రాజులు1:1-4**

రాజైన దావీదు బహు వృద్ధుడాయెను. అతని సేవకులు అతనికి ఎన్ని బట్టలు కప్పినను వెట్ట కలుగక యుండెను గనుక రాజగు దావీదును ఆదరించి ఉపచారము చేసి వెట్ట కలుగజేయుటకు చక్కనైన చిన్నదానిని అతని కౌగిట నుంచిరి. దేవుని కృపను బట్టి దావీదుకు అపవిత్రమైన మనస్సు లేదు ఆమె యెడల దావీదు పవిత్రముగా ఉండెను. దావీదు గొప్ప చక్రవర్తి, ప్రతి పనికి దానికి తగిన వ్యక్తిని దావీదు నియమించెను. రాజ్యము నందు బహు ప్రావీణ్యులు నిపుణులు ధైర్యవంతులు కలరు. తనను పరామర్శించుటకు తన కొరకు ఏర్పరచబడిన సేవకులు దావీదు ప్రమేయం లేకుండానే ఆ చిన్నదాన్ని తీసుకొని వచ్చిరి. దావీదు చివరి దశలో అపవాది కుయుక్తిగా పనిచేయడం ఇక్కడ మనము చూస్తున్నాము. మరల అపవాది దావీదును తన సేవకుల ద్వారా శోధించెను. కాని దావీదు దానిని జయించెను. మన భక్తి జీవితం మీద అపవాదికి చాలా

కనుదృష్టి ఉంటుంది. మన జీవితంలో మనతో ఉన్న మనుష్యులు మనలను భక్తిహీనతలోనికి తీసుకొని వెళతారు అయితే అది భక్తిహీనత అని కూడా మనకు అర్థము కాదు. వారు చేసే పని ఏమిటంటే లోపల విషం పోసి పైన అమృతం అని స్టిక్కర్ పెడతారు. భక్తిజీవితములో నీవు వెళ్ళే మార్గము భక్తి కలిగిన మార్గమా లేక భక్తి విడిచిన మార్గమా అని పరీక్షించుకొనవలెను. ఒకవేళ భక్తివిడిచిన మార్గమైతే నీవు ఇతరుల చేత మోసగించబడుదువు.

దేవుడు దావీదునకు నలుదిక్కులా నెమ్మది, సమాధానము ఇచ్చెను. సొలొమోను పెద్దవాడై పరిపాలించగలిగిన జ్ఞానం పొందుకొనెను. రాజ్యమును దేవుడు స్థిరపరచెను. అయినా దావీదునకు ఇది నా వలన కలిగినది అనే మనస్సు లేదు. దావీదు జీవితంలో చివరి క్షణం వరకు కూడా అపవాది ఎంతో కుయుక్తితో పనిచేసెను. మన భక్తి జీవితములో మనకు ఎన్ని తలాంతులు ఉన్న చివరి నిమిషం వరకు ప్రతిరోజు మనలను మనము కాపాడుకొనవలెను. నీవు భక్తిలోనుండి తప్పిపోయే మార్గాలు నీ జీవితంలోనికి రానివ్వవద్దు. ప్రతి సమయంలో మన నోటి మాటలను హృదయ ధ్యానమును మనము పరీక్షించుకొనవలెను. దేవుడు మనకిచ్చిన ప్రతి అవకాశమును, సమయమును వినియోగించుకొనవలెను.

ప్రియమైన దేవుని బిడ్డలారా మనము దేవునికి చాలా విలువైన వ్యక్తులము. ఈ చివరి దినములలో మనము ఆత్మీయతను కాపాడుకొనుచు ఏది దైవత్వమో ఏది దైవత్వము కాదో గ్రహించుకొని మన తుదిశ్వాస వరకు మెలకువతో అపవాది కుయుక్తులను ఎరిగి దావీదు వలె తుత్తునీయులుగా చేయవలెను. దేవుని వైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెమందు ఓపికతో పరుగెత్తుదుము. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక.

**-ఎడిటర్**

# ఒక గడియయైనను

ఒక పెద్ద క్రైస్తవ పారిశ్రామికవేత్తను గూర్చి విన్న ఒక సహోదరి తన కుమారునికి ఉద్యోగావకాశము దొరుకునా అని ప్రయత్నించుటకు వెళ్ళెను.

ఆయనను ముఖాముఖిగా కలుసుకొన్నప్పుడు, ఆయన దీనత్వము మంచి హృదయము ఆమెను ఎంతో ఆకర్షించెను. ఆయన వయస్సు 70 సం॥లు. ముఖమందు దైవిక కళ కనబడెను. ఎంతో చురుకుగాను ఆరోగ్యముగాను ఉండిరి.

ఆ సహోదరి తన హృదయభారము యావత్తు ఆయన ముందు కుమ్మరించెను. అయ్యా నా కష్టములకు పరిష్కారము ఉన్నదా? నా ఆవేదన తీరునా? అని ప్రశ్నించెను. ''నిజముగా నీ దుఃఖము తొలగిపోవాలని కోరుచున్నావా? దాని రహస్యము మీ చేతిలోనే యున్నది. దానిని మీకు చెప్పమంటారా? అని ఆ పారిశ్రామికవేత్త అడిగిరి.

చెప్పండి, ఏవిధముచేతనైనా నా సంసార బాధలకు విముక్తి కావాలి. మీరు చెప్పిన ప్రకారము చేసెదనని ఆమె జవాబిచ్చెను. పారిశ్రామికవేత్త కొంత సమయము తీసుకొని నిదానించి చెప్పిన మాటలు ఇవి : ప్రతి దినము ఒక గంట ప్రార్థనతో మీరు ప్రారంభించండి. మొదట దేవుని స్తుతించండి. ఆయన సముఖము, ఆయన ప్రసన్నత దినమంతా నిన్ను సంతోషపెట్టును గనుక తప్పక స్తుతించండి. మీ జీవితము వికసించును. దాదాపు 20 సం॥ల క్రితము నేను ఒక పెద్ద పరిశ్రమ పెట్టుకొని యుంటిని. రాత్రింబవళ్ళు శ్రమపడుచుంటిని పని వత్తిడి వలన ప్రార్థించుటకును, బైబిల్ చదువుటకును నాకు సమయము లేకుండెను. అప్పుడు పరిష్కరించలేని సమస్యలు నన్ను చుట్టుముట్టెను. అపజయములు నా హృదయమును చీల్చివేసెను. నా స్నేహితుడొకడు నీవు దేవునికి మొదటి స్థానమిచ్చువరకు నీ పరిశ్రమను దీవించడు. ఆయన వచ్చి నీ జీవితమును ఆశీర్వదించాలని కోరుచున్నావు. గాని నీవు ఆయనయొద్దకు వచ్చుటకు ఇష్టపడుటలేదు. నేడు ఒక తీర్మానము చేయుము. నీవు దినమునకు ఒక గంటయైనను ప్రభువుతో గడిపెదనని మాటయిచ్చి పాటించిన యెడల నీ హృదయము నిశ్చయముగా సమాధానముతో నింపబడును. అంతేకాదు, దేవుని మహిమ నీ మీదకి వచ్చునని చెప్పెను.

కాబట్టి అప్పటినుండి నేను ఒక గంట ముందుగానే నిద్రనుండి లేచితిని. తెల్లవారు లేచుట ఆరోగ్యమును పాడుచేయునని తలంచితిని గాని అది ఆరోగ్యమును పాడుచేయక ఆరోగ్యమును భద్రపరచుచున్నది. ప్రభువు కొరకు ఒక్కగంట సమయమును కేటాయించిన నా జీవితములో గత 20 సంవత్సరముల నుండి ఒక్కసారి కూడా బలహీనత సంభవించలేదు.

ఆయన బైబిల్ తెరచి మత్తయి 26:40 చదివి వినిపించెను. ఆ మాటలు ఆ సహోదరి హృదయమందు మారుమ్రోగుచుండెను. ఒక్క గడియైనను నాతో కూడా మేల్కొనియుండలేరా? ఈ ప్రశ్న ఆమెను బలముగా ఆకట్టుకొనెను. తన కుమారునికి ఉద్యోగము కావాలనే సంగతి మరచి, దేవుని స్తుతించాలనే తీర్మానముతో ఇంటికి వెళ్ళెను. తన యొద్ద నుండిన డబ్బుతో అలారము పెట్టు నిమిత్తము గడియారమును కొనెను. ఉదయము 5 గంటలకు అలారము పెట్టుకొనెను.

మొట్టమొదట అలారము మ్రోగినప్పుడు వెంటనే లేచుట ఆమెకు ఎంతో కష్టముగా నుండెను. ఇంకా కొంత సమయము చేతులు ముడుచుకొని దుప్పటి కప్పుకొని నెమ్మదిగా పరుండవచ్చనే తలంపు కలిగినను దానికి చోటియ్యక తన పడక నుండి లేచి ముఖము కడుగుకొని మోకరించెను. దేవుని ప్రసన్నత ఆమెను ఆవరించెను. ప్రార్థించుచుండగా సమయం ఎలాగు గడిచెనో తెలియక ఉండెను. కొన్ని దినముల తరువాత దేవుని సముఖము ఆమెకు ఆనందముగాను ప్రీతికరముగాను మారెను. సమస్తమును సర్వశక్తిగల దేవునితో సంతోషముగా పంచుకొని సమయము గడిచిన సంగతి తెలియక ప్రార్థనలో గడిపెను.

దినములు గతించిన కొలది ప్రభువు ప్రార్థన వేళలో ఆమె కుటుంబీకులకు జరుగబోవు సంగతులను తెలుపుచుండెను. ఆమె బైబిల్ చదువుచుండగా చక్కటి రహస్యములు నేర్పించెను.

దేవుని బిడ్డా నీ జీవితములో క్రీస్తుకొరకు ఒక గంట సమయము నిచ్చిన యెడల ఆ గంట సమయము నీ జీవితమంతయు అద్భుతముగా మార్చగలదని మరువవద్దు. నీవు హెచ్చింపబడగోరిన యెడల కనీసము గంట సమయాన్ని దేవునికిమ్ము. శాంతి సమాధానములతో జయ జీవితము జీవించగోరిన యెడల ఒక గంట సమయాన్ని దేవునికిమ్ము.

# దేవుని వాక్యములో ఆనందం

**"యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు." కీర్తన 1:2**

యెహోవా ధర్మశాస్త్రమును దివారాత్రము ధ్యానించువాడు ధన్యుడు అని మొదటి కీర్తనలో చూస్తాము. దేవుని ధర్మశాస్త్రమును దివారాత్రము ధ్యానించుట గూర్చి దావీదు ఒక్కడే చెప్పెను. దావీదు జీవితాన్ని మనం గమనించినప్పుడు తండ్రి అన్నల క్షేమాన్ని కనుగొనుటకు తనను పంపించినప్పుడు, గొల్యాతుతో యుద్ధం చేసి విజయమొందడంతో అతని జీవిత ప్రారంభం కనిపిస్తుంది. దావీదు జీవిత ముగింపు సొలొమోనును రాజుగా అభిషేకించి అతడు చేయవలసినవన్ని చెప్పడం మనము చూస్తాము. దావీదుకు తన జీవితంలో దేవుని మీద ఉన్న ఆశను తన చివరి దశవరకు మనము చూడవచ్చు. దావీదు దినములన్ని చూసినప్పుడు దేవుని మీద ప్రేమ, దేవుని యందలి భయం, దేవుని దగ్గర దిద్దుకోవడం, ఎంత పాపమైనా ఒప్పుకోవడం ఇది దావీదు జీవితంలో మనం చూస్తాము. కాని మిగతా వారు కొంత కాలం ప్రభువుని వెంబడించి వారి చివరి కాలంలో ఎంతైనా కొంత ఆశ దేవుని మీద వారికి తగ్గడం, ఆత్మలో దిగజారుడు తనం, మనకు కనిపిస్తాయి. ఆసా అనే రాజు తన జీవిత కాలంలో దేవుని మీద ఆధారపడుతూ వచ్చెను గాని అతని జీవిత ముగింపులో పాదాలలో జబ్బు పుట్టినప్పుడు ఆత్మలో దిగజారిపోయి వైద్యులను ఆశ్రయించినను అతడు స్వస్థపడలేదు. దావీదు జీవితంలో ఇది మనకు కనిపించదు. దినములు గడిచేకొలది దేవునితో నడవడమే కాదు గాని హృదయపూర్వకంగా దేవుని కొరకైనటువంటి ఆశగలిగిన వ్యక్తిగా జీవించాడు. దివారాత్రము ధర్మశాస్త్రమును ధ్యానించడమే దానికి కారణం.

దావీదుకి దేవుని వాక్యం అంటే ఎంతో ఆశ. డబ్బు వచ్చిన, పదవి వచ్చిన మనిషి మారిపోతాడు, పని పెరిగితే ప్రార్థన తగ్గిపోతుంది. వయస్సు

పైబడితే ఆరోగ్యం సహకరించదు. కాని మన పితరులను చూసినప్పుడు వయస్సు పెరిగే కొలది ఆసక్తిగా ప్రభువుని సేవించారు. ఒక వ్యక్తికి దేవుని కొరకైన ఆశ ఆ వ్యక్తిని ఉన్నతమైన భక్తి చేయునట్లుగా చేయును. దేవుని కొరకు నీకు నిజమైన ఆశలుంటే నీ భార్య కాదు, నీ పిల్లలు కాదు, లోకం కాదు, డబ్బుకాదు పదవి కాదు ఏదీ కూడా నిన్నేమీ చేయలేదు. నిన్ను నిరాశ పరిచే పరిస్థితులు నీ జీవితములో ఎన్నో కనిపిస్తాయి. అయితే దేవుని కొరకు పనిచేయాలనే ఆశ, ఆ పరిస్థితులలో నిన్ను కదలని వానిగా చేస్తుంది. దావీదు భూసంబంధంగా ఉన్నతమైన పదవిలో ఉన్నాడు. తన జీవితంలో తాను చెప్పుకోవడానికి ఎన్నో గొప్ప విజయాలున్నాయి. అడవిలో సింహాన్ని ఎలుగుబంటిని చంపాడు. ఆ విషయం కుటుంబికులకు మరెవరికి కూడా తెలియదు. సౌలు దగ్గర సందర్భం వచ్చినప్పుడు మాత్రమే ఆ పదాలు వాడినట్లుగా మనం వాక్యంలో చూస్తాము.

దావీదు ఎన్ని కీర్తనలు వ్రాసినా నేను మిన్నల్లిని అని పోల్చుకొన్నాడు. దావీదుకు ఉన్నటువంటి విజయాలు కృపలు ఎంతో గొప్పవి. ఎన్నో విజయాలు గొప్పకార్యాలు ప్రభువు మన జీవితములో చేసి ఉండవచ్చు అయితే దావీదు చెప్పినట్లుగా నేను మిన్నల్లిని అని చెప్పగల్గుచున్నామా? దావీదు చచ్చిన కుక్కలాంటి వాడను అంటాడు. బ్రదికి ఉన్న కుక్కతో ఎందుకు పోల్చుకోలేదా అని అనుకొంటాను, బ్రదికి ఉన్న కుక్క యజమానుడికి నమ్మకంగా విశ్వాసపాత్రగా ఉంటుంది. దావీదు, ఊరియా విషయంలో బత్షెబ విషయంలో నమ్మకంగా లేదు కదా! ఆ నమ్మకత్వాన్ని పోగొట్టుకొన్నాడు కాబట్టి చచ్చిన కుక్క లాంటి వాడను అని చెప్పాడు. దేవుని కొరకు ఆశ కలిగిన వ్యక్తి లోతుగా వెళ్ళాలనుకొంటాడు. వృద్ధాప్యంలో చిన్నదానియందు మంచి మనస్సాక్షి కలిగి బ్రతికెను. బత్షెబతో తాను చేసిన ప్రమాణములను గుర్తు చేసికొని వాటిని స్థిరపరచెను. దేవుని వాక్యం కొరకు దావీదుకున్న ఆశ తనను ఆ విధంగా జీవింపచేసినది. నీవు దేవునితో చేసిన నిబంధనలు,

దేవునితో నడుస్తున్నప్పుడు ప్రజలకు చేయవలసిన విషయాలు, ప్రాణం పోయేటప్పుడు కూడా గుర్తుచేసుకో. దావీదుకు దేవుని యెడల ఎంతో కృతజ్ఞత ఉంది. దేవుని ధర్మశాస్త్రమును దివారాత్రము ధ్యానిస్తాను అంటాడు. నీవు రెండు మూడు అధ్యాయాల కంటే ఎక్కువ చదువలేకపోతున్నావు. ప్రార్థనలో కూర్చుంటే నిద్ర వస్తుంది. కారణం ఏమిటి? దేవుని కొరకు నీకు లోతైన ఆశ ఉందా? ఆశ వుంటే వయస్సు పై బడి కనుచూపు తగ్గిపోయినా ఆడియో బైబిలు పెట్టుకోనైనా వింటావు. నీకున్న ఆశ నీ జీవితాన్ని అలా చేస్తుంది. ఉదయకాలం లేవకుండా ఉండలేవు. నీ మనస్సు బలహీనంగా ఉండదు. ఉదయకాలం లేవడానికి బలహీనత అనే పదాలు మనం వాడతాము. ఎందుకు బలహీనత? తినకపోయినా బలహీనత వస్తుంది. ఎక్కువ తిన్నా బలహీనతే ఉంటుంది. ఆ రెండూ కాకపోతే నిన్ను ఎవరూ అడిగేవారు లేరని నీవు లేవవు. నీ మానసికమైన వ్యాధికి కారణం ఏమిటి?

నెహెమ్యా రాజుకి గిన్నె అందించేటప్పుడు రాజు అడిగాడు నీకు వ్యాధిలేదు కదా ఎందుకు నీ ముఖము విచారంగా ఉంది అని. అంతకముందు ఎప్పుడూ నెహెమ్యా రాజు ముందు అలా లేడు. ఆరోగ్యం బాగుగా లేదు అని సెలవు తీసికొనలేదు. మీ విశ్వాస జీవితంలో నుండి బలహీనంగా ఉ న్నాను అనే మాటను నిషేధించండి. ఒకవేళ నీవు సెలవు తీసుకొంటే ప్రభువు నిన్ను పిలిచిన రోజే అయి ఉండాలి. ప్రతిరోజూ ఉదయకాలం దేవుని ఆరాధించాలి. దేవునితో రెండు రకాల జీవితాలుంటాయి. వాక్యాన్ని తీసుకొని వాక్యంలో ఆనందించే జీవితం. వాక్యాన్ని తీసుకోలేక సతమతమైపోయే జీవితం. నీవేమి వింటున్నావో ఏమి నేర్చుకొంటున్నావో దానిని అనుసరిస్తున్నావా? నోరు తెరిచే విషయమైనా పాట పాడే విషయమైనా దేవునిని ఆరాధించే విషయమైనా. దేవుడు నీకు యౌవన కాలాన్ని ఇచ్చాడు మౌనంగా ఉండవద్దు చక్కగా చప్పట్లు కొట్టి ప్రభువుని ఆరాధించడం నేర్చుకో. అది నీకు గొప్ప ఆశీర్వాదం. పౌలు మరలా చెప్పుదును ప్రభువు నందు ఆనందించండి అని చెప్పాడు. నిన్ను నీవు పరిశీలన చేసుకో. వాక్యం మీద

నీకు ఆసక్తి పెరుగుతుందా? దేవునితో నడిచే విషయంలో ఆసక్తి పెరుగుతుందా? దావీదు తన ముందు అభిషేకించబడిన సౌలు కూలిపోతే తాను మాత్రం తరతరములకు ఆశీర్వాదకరంగా మిగిలాడు. నీ ముందున్న తరం వ్యభిచార తరం. ఎటు చూసినా పాపం కనపడుతుంటే బైబిలు అది నేర్పదు అని నిరూపించే భక్తి చేయాలి. ప్రజలు మన క్రమమైన జీవితం చూసినప్పుడు మనలను ద్వేషించకూడదు. మనం మాట్లాడుతున్న విధానం చూసినప్పుడు మనలను తృణీకరించకూడదు. ప్రజలకు డబ్బు కావాలనో, ఘనత కావాలనో, భోజనం కావాలనో, వస్త్రాలు కావాలనో మన యొద్దకు రారు. దేవుని బట్టి వారు మనకు లోబడతారు. నీవు దానిని ఎలా తీసుకొని నడుస్తావు అనేది నీ యిష్టం. నీవు మూగమొద్దులా ఉంటావా? కలసి ప్రార్థన చేస్తావా? నాకవసరం లేదు వీరితో అనుకొని దాటి వెళ్ళిపోతావా? అది నీ ఇష్టం. ఒక రోజు ప్రజలు నీకు అవసరం వచ్చినప్పుడు వారు కూడా అంతే వెళతారు. ఒక వ్యక్తి ఉదయకాలం తన సమయాన్ని ప్రార్థనా పూర్వకంగా గడిపితే ఎంత పనైనా దేవుని మీద ఆధారపడి చేయవచ్చు.

విక్టోరియా మహారాణి ప్రపంచ సామ్రాజ్యానికి న్యాయం చేయగలిగింది. ప్రపంచ విషయాలు ఒక స్త్రీ చేయగలిగింది. ఆదివారపు ఆరాధనకు వెళ్ళి ఆమె అందరితో నిలబడి (బ్లెస్ ద లార్డ్ ఓ మై సోల్ అని) ఏడుస్తూ పాడేది. మేడమ్ దయచేసి మీరు కూర్చోండి అంటే ఆమె నేను కూడా దేవుని దగ్గర మీలాంటి వ్యక్తినే. కాకపోతే ఇప్పుడు ఇంగ్లాండ్ రాణిగా ప్రభువు నన్ను చేసారు అనేవారు. నీకున్న భక్తి నమూనా ఏ ప్రమాణాలతో కట్టుకొంటున్నావు? <u>పట్టుకోవాలి కాబట్టి బైబిలా,</u> చదవకపోతే ఆశీర్వాదం ఉండదని చదువుతున్నావా? బైబిలే నీ సర్వం అయితే గొప్ప ఆశీర్వాదం చూస్తావు. దావీదుకు మందిరాన్ని కట్టమని ఎవరు చెప్పారు? మందిరానికి కానుక ఇవ్వమని ఎవరు చెప్పారు? నీకు పరిచర్య చేయమని ఎవరైనా చెప్పాలా? అదా నీ భక్తి? చెప్పిన దాని వరకేనా? తానిచ్చిన కానుక తాను చేసిన పని ఇప్పటి వరకు భూమి మీద పుట్టిన ఏ మనిషీ చేయలేకపోయాడు.

దావీదుకి అంత ఆశ ఉంది. దావీదు దేవుడే నీ దేవుడు. నీవు చేసింది ఇంకెవరూ చేయలేకుండా చేయాలి. నీవు చేసిన పనిలో నీ పరిచర్య ఆ నమ్మకత్వం ఇంకెవరూ ఎప్పుడూ చూపలేనంతగా ఉండాలి. నీవు ప్రజలకు చూపించే ప్రేమ ఎవరూ చూపించలేరు అన్నట్లుగా నీవు భక్తి చేయాలి. శత్రువులను దావీదు ప్రేమించినంత ఇంకెవరైనా ప్రేమించారా? ప్రభువా నేను వ్యభిచారిని నన్నేమిటి ఇలా చేసావు అని దివారాత్రము దేవుని సన్నిధిలో విలపించేవాడు దావీదు. నీకు హృదయం దాచుకోవడం అలవాటు దావీదుకి హృదయం విప్పడం అలవాటు. నానోరు ఆయన కీర్తిని ప్రచురం చేస్తుంది. వచ్చు తరమునకు నీ బాహుబలం గురించి నీ శూరకార్యముల గురించి చెపుతాను అంటాడు. నీవు హృదయమే విప్పని వ్యక్తివి ఆయన శూరకార్యముల గురించి ఏమి చెప్పగలవు? ఎక్కడా దావీదు తన జీవితంలో ఎవరిపై నేరం మోపకుండా జీవించాడు. దేవుడు నీ ముందున్నాడు. ఆయన నీకు అవకాశం ఇచ్చాడు, ఆయనే నిన్ను పైకెత్తుతాడు, నిన్ను నడిపిస్తాడు. ఒక నిజమైన క్రైస్తవుని జీవితంలో ఇతరులపై నేరారోపణ చేయడం ఉండదు. ప్రపంచ దర్శనం కలిగిన పరిచర్యకి ప్రభువు నిన్ను ఎన్నుకొన్నాడు. సింహాన్ని బోనులో నుండి తీస్తే ఎలా ఉంటుందో ఉదయకాలం లేచిన ఒక క్రైస్తవుని జీవితం కూడా అంతే ఉంటుంది. సింహం పంజా విసిరితే ఎవరూ నిలువలేరు. అది క్రైస్తవ జీవితం. జీవితకాలమంతా సింహంవలె వ్యాధికి, నిందకి, సమస్యకి, పరిస్థితికి దేనికీ భయపడకూడదు. దావీదు ఆలోచన యుద్ధానికి ఎవరూ అవసరం లేదు నేను ఒక్కడినే వెళతాను అంటాడు. నీకు సమస్య ఉన్నప్పుడు ఎవరూ రారు. నీవు విజయంతో ఉన్నప్పుడు మాత్రమే అందరూ వస్తారు. నీ సంతోషంలో ఎవరైనా పాలుపంపులు పొందుతారు. నీ బాధను, బరువును ఎవ్వరూ తీసుకోరు. యేసుమాత్రమే ఎప్పుడూ నీతో కూడ ఉండేది. దావీదు వలె నమ్మకమైన దేవునికి మనల్ని మనం అప్పగించుకొందాము. దేవుడు మిమ్మల్ని దీవించును గాక!

## ప్రేమ మౌనంగా వుంటుంది
## త్వరగా కోపపడదు

ప్రేమగల నాయకులు ప్రతి చిన్న అసమ్మతికి లేదా నిరుత్సాహానికి చికాకుపడరు. దీనికి కారణం, ప్రేమ సహిస్తుంది. ఇతరులు చేసిన తప్పిదాల పట్ల ప్రేమ దీర్ఘకాలం సహిస్తుంది. తమను తాము నిగ్రహించుకొనేవాళ్ళు పేట్రేగిపోయే పరిస్థితుల్ని సమర్థవంతంగా అదుపులోకి తెచ్చి ఉద్రేకాలవల్ల జరిగిన నష్టానికి విరుగుడు చేయగలుగుతారు. **"దీర్ఘశాంతుడు వివాదము నణచివేయును"** సామెతలు 15:18.

హడ్సన్ టేలర్ కోపపడడానికి, చిరాకుపడడానికి ఎలా నిదానించేవాడోనని మార్టిన్ లాయడ్ జోన్స్ రాసాడు. హడ్సన్ టేలర్ చైనాలో ఓ పెద్ద నది ఒడ్డున నిల్చొని తనను నదికి అటువైపు తీసుకెళ్ళడానికి దాన్లో తిరుగుతున్న పడవ నొకదాన్ని రమ్మన్నాడు. సరే, ఆ పడవ ఒడ్డుకు వచ్చింది. ఇంతలో చైనాలో ధనవంతుడొకాయన హడ్సన్ టేలర్ వెనుకగా వచ్చి దాన్ని ఎక్కాలని తొందరపడ్డాడు. అతను టేలర్‌ని బలంగా త్రోసివేయడంతో టేలర్ బురదలో పడ్డాడు. ఆ సంఘటన గమనించిన పడవవాడు బిత్తరపోయి ధనవంతుణ్ణి ఎక్కించుకోనని చెప్పాడు. టేలర్ తనను ముందు పిలిచాడని, విదేశీయుడని, చైనీయుల సాంప్రదాయం ప్రకారం అతను గౌరవంగా పరామర్శించడానికి యోగ్యుడని అతను అనుకొన్నాడు. టేలర్ చైనీయుల బట్టలనే కట్టుకొని వుండడంతో ఆ ధనవంతుడు అతని విదేశీయుడని గుర్తించలేదు. అతను టేలర్‌పట్ల చేసిన తప్పును తెలిసికొన్న వెంటనే క్షమాపణ కోరాడు. హడ్సన్ అతని గురించి చిరాకుపడలేదు లేదా కోపగించుకోలేదు. దానికి బదులు అతని తనతోపాటు పడవలో ప్రయాణించమంటూ చిరునవ్వుతో ఆహ్వానించి అతనికి క్రీస్తు ప్రేమను చూపాడు. సర్వోత్తమ మార్గంలో హడ్సన్ టేలర్ కోపోద్రేక పరిస్థితికి అలా స్పందించాడు.

# మార్టిన్ కల

మార్టిన్ చాల పేదవాడు. అతడు చెప్పులు కుట్టుకొని బ్రతికేవాడు. తన కుటుంబాన్ని పోషించుకోవడానికి తన షాపులో రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేసేవాడు. అయినను పూటగడపడం కష్టంగానే ఉండేది. అయితే అతనిలో ఒక ప్రత్యేకత ఉన్నది. అదేమిటంటే అతడు ఎల్లప్పుడు ఆనందంగా ఉంటాడు. అతనిలోనున్న ఆ యానందానికి మూల కారణం ఏమిటో తెలుసా! అతడు ప్రభువుని తన రక్షకునిగా అంగీకరించాడు. యేసుప్రభువు అతనికి శాంతి సమాధానములను అనుగ్రహించాడు. కాబట్టి ఈ లోకంలో అతనికి ఆస్తిపాస్తులు లేకపోయినప్పటికిని పరలోకంలో అతనికి తరగని నిధులున్నాయి.

ఒకసారి మార్టిన్‌కు ఒక కల వచ్చింది. ఆ కలలో ఒక మహా గొప్ప వ్యక్తిని చూశాడు. అదివరకెన్నడు అతని జీవితంలో అలాంటి వ్యక్తిని చూడలేదు. ఆయన ఎంతో సౌందర్యవంతుడుగానున్నాడు. ఆయన ముఖము ఎంతగానో ప్రకాశిస్తుంది. తన రూపము చూడ్డానికి ఎంతో అద్భుతముగా ఉన్నది. ఆయన స్వరము అతి మధురంగా ఉన్నది. ఆయన మార్టిన్‌తో “మార్టిన్ రేపటి దినము నేను నీ దగ్గరకు వస్తాను” అన్నాడు. మార్టిన్‌కు మెలకువ వచ్చింది. కలలో కనిపించిన ఆ వ్యక్తి ఎవరైయుంటారోనని ఆలోచించసాగాడు. “ఆయన ఎవరో కాదు తాను యింతకాలము సేవించుచున్న యేసు ప్రభువే” అని గ్రహించాడు. అప్పుడు మార్టిన్‌కు చాలా సంతోషం కలిగెను.

ఉదయాన్నే లేచాడు. స్నానపానాదులనాచరించాడు. బైబిల్ చదువుకొని ప్రార్థన చేసుకున్నాడు. షాపంతా శుభ్రం చేశాడు. తాను ప్రేమించిన ప్రభువు రాకకోసం ఆసక్తిగా ఎదురు చూడసాగాడు. చాలా సమయం గడిచింది. కాని ప్రభువు రాలేదు. కొంచెం నిరాశకు గురయ్యాడు. యింతలో ఒక వృద్ధుడు అతని దగ్గరకు వచ్చాడు. ఆ దేశంలో మంచు బాగా కురుస్తుంది. ఉదయాన్నే రోడ్లమీదనున్న మంచు గడ్డలను తొలగించాలి లేకపోతే వాహనాల రాకపోకలు ఆగిపోతాయి. ఆ వృద్ధుడు రోడ్డు మీదనున్న

మంచుగడ్డలను తొలగించి బాగా అలసిపోయి మార్టిన్ దగ్గరకు వచ్చాడు. అతనిని చూచిన మార్టిన్‌కు జాలి కలిగింది. లోనికి ఆహ్వానించాడు. అతనికి ఒక రొట్టెముక్కను వేడి వేడి పాలను అందించాడు. ఆ వృద్ధుడు ఆవురావురుమంటూ వాటిని ఆరగించి ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

మార్టిన్ మనసంతా ప్రభువు మీదనే ఉన్నది. యింకా ప్రభువు రాలేదేంటీ అని మథన పడసాగాడు. ప్రభువు ఎప్పుడు వస్తాడోనని ఆసక్తితో ఎదురు చూడసాగాడు. సాయంకాలమయ్యింది ప్రభువింకా రాలేదు. అతనిలో సహనం నశించసాగింది. యింతలో ఒక పేద స్త్రీ అక్కడికి వచ్చినది. ఆమె ఒక చంటి బిడ్డను ఎత్తుకొని వచ్చినది. ఆ బిడ్డ ఎంతో అనారోగ్యముగా నున్నాడు. మార్టిన్ హృదయం కరిగిపోయింది. ఆ తల్లి బిడ్డలకు తృప్తిగా భోజనం పెట్టాడు. బయట చలిగానున్నందున తన కోటును యిచ్చి ఆ బిడ్డకు కప్పమన్నాడు. ఆ తల్లి కృతజ్ఞతలు చెల్లించి వెళ్లిపోయింది.

అయితే మార్టిన్‌కు తృప్తికలుగలేదు. తాను ఎదురుచూచిన ప్రభువు రాలేదు. ప్రభువు మాట యిచ్చాడు. మరి ఎందుకు నెరవేర్చలేదో! మార్టిన్‌కు అర్థంకాలేదు. ఎంతో నిరాశతో నిద్రలోకి జారుకున్నాడు. అయితే మార్టిన్‌కు మరల కల వచ్చింది. గతించిన రాత్రి కన్పించిన అద్భుతకరుడు మరల కనిపించాడు. “మార్టిన్ నేను నీ దగ్గరకు రాలేదని అనుకుంటున్నావు కదా! నేను ఈ దినమున రెండుసార్లు నీ దగ్గరకు వచ్చి నిన్ను దర్శించాను. నీవు నన్ను గుర్తించావా? నా నామము నిమిత్తము నీవు సహాయం చేశావు” అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

“నేను ఆకలిగొంటిని మీరు నాకు భోజనము పెట్టితిరి. దప్పిగొంటిని నాకు దాహమిచ్చితిరి. పరదేశినైయుంటిని నన్ను చేర్చుకొంటిరి, దిగంబరినైయుంటిని నాకు బట్టలిచ్చితిరి, రోగినైయుంటిని నన్ను చూడవచ్చితిరి... మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరి” అని చెప్పిన ప్రభువు మాటలలోని అర్థాన్ని గ్రహించుకొన్నాడు మార్టిన్.

# ఉన్నతమైన ఆశలు

**"అప్పుడు జెబెదయి కుమారుల తల్లి తన కుమారులతో ఆయనయొద్దకు వచ్చి నమస్కారముచేసి యొక మనవి చేయబోగా నీవేమి కోరుచున్నావని ఆయన అడిగెను. అందుకామె నీ రాజ్యమందు ఈ నా యిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను ఒకడు నీ యెడమవైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను" మత్తయి 20:20,21**

యేసుప్రభువు శిష్యులైన యోహాను, యాకోబుల తల్లి యేసుప్రభువు దగ్గరకు వచ్చి నమస్కారం చేసి మనవి చేయబోగా ఆమె హృదయం ప్రభువుకి అర్థమైంది. అందుకే ఆమె అడగకమునుపే నీవేమి అడగకోరుచున్నావని ప్రభువే అడిగెను. ఆయన సర్వాంతర్యామి మనలను చూడకుండానే మన ఆలోచనలు ఎరిగిన దేవుడు. ఆమె ఈ లోకసంబంధమైన వాటి మీద దృష్టి పెట్టలేదు. గనుక ఆమె తన ఇద్దరు కుమారులు యేసుప్రభువు ఇరుప్రక్కల ఉండాలని కోరుకొంటుంది. ఆమె తన కుమారులైన యాకోబు యోహానులను ఉన్నతమైన ఉద్దేశాలతో పెంచెను. అందుకే వారు చాలా శ్రేష్టులుగా ఉన్నారు. వారి విషయమై ఈ లోకసంబంధమైన ఆలోచన ఆమెలో లేదు.

సహజంగా ఒక తల్లికి నలుగురు పిల్లలుంటే వారు త్వరగా ఎదగాలని త్వరగా స్థిరపడిపోవాలని అనుకుంటుంది. లోకసంబంధంగా స్థిరపరచబడే దాని మీద మనస్సు పెడతారు గాని ఆత్మసంబంధమైన స్థిరత మీద అంత త్వరగా మనస్సు పెట్టలేరు. ప్రభువుని ఎరిగినా ఎరుగకపోయినా లోకసంబంధమైన వాటికే ప్రాధాన్యత ఇస్తారు. వాటి మీదికే త్వరగా మన దృష్టి వెళుతుంది. కొంతమంది ఆత్మసంబంధమైన విషయాలతో నింపబడి పిల్లలను ప్రభువు కొరకే పెంచేవారున్నారు. దాదాపు ఎక్కువమందికి భూసంబంధమైన మనస్సే ఉంటుంది. ప్రభువును ఎరిగిన తరువాత కూడా ఏమి తినాలి? ఏమి త్రాగాలి? ఏమి ధరించాలి? ఎలా స్థిరపడాలి? ఎలా

త్వరగా ఎదగాలి? ఏ విధంగా ఈ లోకంలో ఉన్నతమైన స్థితిలోకి వెళ్ళాలి అని లోకం గురించే ఆలోచన చేస్తారు. మనం ప్రభువుని ఎరిగాము మనల్ని ప్రభువు ఆశీర్వదించాడని ప్రజలు అనుకోవాలనుకొంటాము.

ఒక తల్లికి నలుగురు పిల్లలున్నారు. వారిది చాలా నిరుపేద స్థితి. అందరూ కష్టపడి మంచిగా చదువుకొన్నారు. చిన్నప్పటి నుండే వారికి కష్టపడడం ఆ తల్లి నేర్పించినది. కాబట్టి చిన్న వయస్సు నుండే వారు డబ్బులు సంపాదించేవారు. తరువాత మంచి చదువులు చదివి లోకపరంగా దీవించబడ్డారు. ఒకప్పుడున్న దీనస్థితి ఇప్పుడు వారి జీవితములో లేదు. దేవుడు వారిని ఆశీర్వదించారు. వారికున్న సమయములో దేవుని పరిచర్య కూడా చేసేవారు. అయితే వారికి ఒక ఆలోచన వచ్చింది. ఒకప్పుడున్న దీనస్థితిలోనే ఎందుకుండాలి? దేవుడు మమ్ములను ఆశీర్వదించారని అందరికి తెలియాలని లోకపరంగా ఉన్నతంగా ఉండాలి, లోకంతో నడవాలని అనుకొన్నారు. వారు మంచి ఆత్మసంబంధమైన విలువలు గలిగినవారే. అయితే వారిలో లోకసంబంధమైన ఆశలు కనబడుతున్నాయి.

జెబెదయి కుమారుల తల్లికి ఇటువంటి ఆశలు లేవు. యేసుప్రభువు దగ్గరికి వచ్చి నా కుమారులు నీ కుడివైపున ఒకరు నీ యెడమవైపున ఒకరు ఉండాలి అని అడిగినది. మిగతా శిష్యుల యొక్క తల్లులలో ఏ తల్లికీ ఇటువంటి ఆశలు లేవు. వారి తల్లి వచ్చి ఇలా అడిగిందంటే ఆమెకి ఉన్నతమైన ఆత్మీయ అనుభవం కలిగియున్నది. యేసుప్రభువు యొక్క సువార్త పరిచర్యలో ఆమె దేవుని వాక్యం విని ఎంత ప్రార్థన చేసిందో! దేవుడు తన పిల్లలను పిలువకముందే దేవుని సన్నిధిలో హన్నా మొక్కినట్లుగా మొక్కి యుండవచ్చు. అందుకే యేసుప్రభువు కనుదృష్టి ఆమె పిల్లల మీదికి వెళ్ళిపోయింది.

**"జెబెదయి కుమారులైన యాకోబును యోహానును ఆయన యొద్దకు వచ్చి బోధకుడా, మేము అడుగునదెల్ల నీవు మాకు చేయ**

**గోరుచున్నామని చెప్పగా ఆయన నేను మీకేమి చేయ గోరుచున్నారని వారి నడిగెను. వారు నీ మహిమయందు నీ కుడివైపున ఒకడును నీ యెడమవైపున ఒకడును కూర్చుండునట్లు మాకు దయచేయుమని చెప్పిరి. యేసు మీరేమి అడుగుచున్నారో మీకు తెలియదు నేను త్రాగుచున్న గిన్నెలోనిది త్రాగుటయైనను, నేను పొందుచున్న బాప్తిస్మము పొందుటయైనను మీచేత అగునా? అని వారి నడుగగా వారు మా చేత అగుననిరి" మార్కు 10:35-38.**

జెబెదయి కుమారుల తల్లి తన కుమారులకు యేసుప్రభువు కొరకు మీరు శ్రమపడి దేవుని యొక్క రాజ్యము కట్టాలని అవసరమైతే మీ ప్రాణాలు పెట్టడానికైన వెనుకాడకూడదని నేర్పినది. కాబట్టి ఆ చేదైన అనుభవాలలో, శ్రమలలో, ప్రాణాప్రాయ స్థితిలో నడువవలసి వచ్చినప్పుడు మీరు బాధపడవద్దు. మీకు దేవుని రాజ్యంలో గొప్ప మహిమ ఉంటుంది. ఆ దేవుని రాజ్యంలో మీరు కుడివైపున ఒకరు ఎడమవైపున ఒకరు ఉంటారని నేర్పి ఉంటుంది. తల్లి మనస్సులో ఏముందో అదే బిడ్డలు పుణికిపుచ్చుకొన్నారు. అందుకే వేరొక ఆలోచన జెబదయి కుమారులకు లేదు. వారు ఒకప్పుడు కష్టపడి పనిచేసి చేపలుపట్టుకొన్నటువంటి వారు. కాని ప్రభువు దగ్గరకు వచ్చిన తరువాత తల్లి ఏమి అడిగిందో బిడ్డలు కూడా అదే అడుగుతున్నారు. తల్లి బిడ్డలకు నేర్పకుండా అలా అడిగారా? లేదే. తల్లులుగా కుటుంబాలలో ఉన్న పెద్దలుగా దేవుని వాక్యం చదువుచున్న, వింటున్న మనం దేవుని ఏమి అడుగుతున్నామో పిల్లలు కూడా అదే అడుగుతారు. మనం ఏమి తలస్తామో పిల్లలు కూడా అదే తలస్తారు. మనం భూసంబంధమైనవి కోరుకొంటే పిల్లలు కూడా భూసంబంధమైనవే కోరుకుంటారు. మనం ఆత్మసంబంధమైనవి వాంఛించేవారిగా ఉంటే పిల్లలు కూడా ఆత్మసంబంధమైన వాటినే వాంఛిస్తారు. ఇక రెండో ఆలోచన రెండో తలంపు వారిలో ఉండవు. ఆమె వారి ఇద్దరినీ రెండు కళ్ళుగా

పెంచింది.  కుటుంబంలో ఇద్దరు పిల్లలుంటే కొంతమంది చిన్నవాడిని కొంతమంది పెద్దవాడిని ప్రేమిస్తారు. అమ్మ చిన్నవాడిని ప్రేమిస్తే నాన్న పెద్దవాడిని ప్రేమిస్తారు. ఈ తారతమ్యాలు ఆమె జీవితంలో లేవు. పక్షపాత దోరణి తల్లిదండ్రులలో ఉంటే పిల్లలు యాకోబు ఏశావుల వలె అయిపోతారు. రిబ్కా యాకోబుని ప్రేమించింది.  వృద్ధుడైన ఇస్సాకు తన పెద్దకుమారుడైన ఏశావును వేటాడి మాంసము తెమ్ము నేను నిన్ను ఆశీర్వదిస్తాను అని చెప్పిన మాటలను రిబ్కా విని  చిన్నవాడి మీద మమకారంతో ఏశావు అడవికి వెళ్ళి వేటాడి మాంసం తెచ్చేలోపే రిబ్కా మందలో నుండి  మేకను తెప్పించి వండి యాకోబుకు ఇచ్చి తండ్రి యొద్దకు వెళ్ళమన్నప్పుడు అతడు అమ్మా నా తండ్రి నన్ను తడవి చూస్తే నాకు శాపమే గాని ఆశీర్వాదం తెచ్చుకొనను అనగా  అతని తల్లి నా కుమారుడా ఆ శాపం నా మీదకు వచ్చును గాక అనెను.

జెబెదయి కుమారుల తల్లి రిబ్కావలె మోసపూరితమైన మార్గంలో ఆశీర్వాదం పొందాలని కోరుకోలేదు.  రిబ్కా వలన 20 సంవత్సరాలు యాకోబు ఏశావులు ఒకరి ముఖాన్ని ఒకరు చూసుకోలేదు.  యాకోబు 20 సంవత్సరాలు తల్లికి తండ్రికి దూరంగా వెళ్ళిపోయాడు. ఆ తరువాత దేవుడు యాకోబుకు వాగ్దానం ఇచ్చి వాగ్దాన దేశానికి తీసుకొని వచ్చాడు. ఈ ఎడబాటుకి కారణం రిబ్కా. పిల్లలలో ఒక ద్వేషపూరితమైన ఆత్మ పనిచేస్తూ ఉంది.  అలా పనిచేయడానికి కారణం తల్లిదండ్రులే.  అది వారికి తెలియదు. కొంతమంది పిల్లలను బాగా చదివితే ప్రేమిస్తారు. చదవకపోతే  ప్రేమించలేరు. అది ఎలా క్రీస్తు ప్రేమతో పెంచడం అవుతుంది? అది కాదు కదా! దేవుడు అలా చేయలేదు కదా! మనం మంచి వారమని తన ప్రాణం పెట్టలేదు కదా! ప్రభువు మనలను ఎలా ప్రేమించారు? ఆయన ప్రేమలో స్వార్థం లేదు. ఆయన ప్రేమలో పక్షపాతం లేదు. ఆయన అందరి కొరకు వెల చెల్లించారు.

ప్రభువు నెరిగిన తల్లులుగా తండ్రులుగా మనలో పక్షపాతం ఉండకూడదు.  జెబెదయి కుమారుల తల్లిలో పక్షపాతం లేదు. కొంతమంది

పిల్లలలో తల్లిదండ్రుల రూపాలు కనిపిస్తే మనస్సులో ప్రేమ, లోలోపల సంతోషిస్తారు. అచ్చం నాలాగే నేను మాట్లాడినట్టే, నేను నడిచినట్టే, నేను పాడినట్టే, నేను ప్రకటించినట్టే అనుకుంటారు. సేవకులైతే పిల్లలను చూసి మురిసిపోతుంటారు. దేవుడు నిన్ను పరీక్షించడానికి నీ పిల్లలలో నీ అత్త లక్షణాలు లేదా మేనత్త లక్షణాలు పెడతారు నీవు ప్రేమిస్తావా లేదా అని? ఆయన ప్రేమ అమర్యాదగా నడువదు, ఉప్పొంగదు, అపకారాన్ని మనస్సులో ఉంచుకోదు. కొంతమంది మాట వింటారు కొంతమంది మాట వినరు. వారు ఎటువంటి వారైనప్పటికి నీవు చూపించు దేవుని ప్రేమ మారకూడదు. ఇద్దరికీ నీవే కదా ప్రాణం ఇచ్చింది. నీ రక్తమాంసాలు పట్టుకొనే కదా వారు పుట్టారు. జెబెదయి కుమారుల తల్లి అయితే ఎంతో దైవికమైన, పరిశుద్ధమైన ఆశలు గలిగిన తల్లి పైనున్న వాటిని వెదకుతుంది.

నా పిల్లలకు భూసంబంధమైన వాటిని గురించి ఆలోచించను. వారు దేవుని కొరకు పానార్పణంగా పోయబడాలి. కుడివైపున ఒకడు ఎడమవైపున ఒకడు ఉండాలంటే దాని అర్థం ఏమిటంటే ఆయన రాజ్యమందు తన ఇద్దరు కుమారులు యేసుప్రభువుకు ఇరు ప్రక్కల ఉండవలెను. అలాగే ఆమె కోరినట్లుగా యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత తన శిష్యులలో మొదటిగా హతసాక్షియైనది యాకోబు. చివరిగా యోహాను హతసాక్షియై యేసుప్రభువు యొక్క సింహాసనమునకు ఇరుప్రక్కల ఉండిరి. ఆ తల్లి ఏమి పలికిందో అది పొందుకొన్నది. ఈ దినాలలో మనమేమి పలుకుచున్నాము. మన నోటిలో శక్తి ఉంటుంది. ఖచ్చితంగా దానిని మనం పొందుకొంటాము. జెబెదయి కుమారుల తల్లి వలె నీ పిల్లలను దేవుని కొరకు ప్రార్థనపూర్వకంగా పెంచి వారిలో ఆత్మసంబంధమైన ఆశలు కలిగించే క్రీస్తు ప్రేమను కనుపరచుటకు విశ్వాసంతో దేవుని పాదముల యొద్దకు వెళ్ళవలెను

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2022-24

## 2024 - జూన్
## సువార్త ఉజ్జీవ సభలు

**6,7,8** **మార్టూరు**
విజయలక్ష్మి కళ్యాణ మండపం
దగ్గర ఖాళీ స్థలంలో
నేషనల్ హైవే ప్రక్కన,
చిలకలూరిపేట రోడ్

**13,14,15** **తుని**
రాజా హైస్కూల్ గ్రౌండ్

**17,18,19** **కళ్యాణదుర్గం**
దొడ్డగట్ట రోడ్
వ్యవసాయ మార్కెట్ యార్డ్

**20,21,22** **నంద్యాల**
SPG గ్రౌండ్

To,
Sri / Smt.

If undelivered please return to :
**Bro. DEEVANAIAH**, Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month